బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



మదర్‌థెరిస్సాకు నీరాజనం

నెహ్రూనగర్(గుంటూరు): గుంటూరు డయాసీస్ సోషల్ సర్వీసెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరిస్సా వర్ధంతిని నిర్వహించారు.



విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు): ఓబులనాయుడుపాలెం శ్రీరామ్ ఆగ్రోకెమికల్ ఇండస్ట్రీలో మంగళవారం విజిలెన్స్ తనిఖీ జరిగింది. గడువు తీరిన రూ.3.77 లక్షల మందులు సీజ్ చేశారు.



కృష్ణాష్టమి వైభవం

దాచేపల్లి : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణాలంకారంలో అలరించారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల ప్రవేశాలకు మంగళవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న, చేయని విద్యార్థులను కూడా స్పాట్ కౌన్సెలింగ్‌కు అనుమతించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పాలిటెక్నిక్ డైరెక్టర్ ఎం.రేఖ తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 38,258 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 36,310 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 38,258 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ.24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,495 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఫార్మసిస్టు ఉద్యోగాలు ఎనిమిది, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు రెండు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు నాలుగు, ఎల్‌జీఎస్ ఉద్యోగాలు తొమ్మిది భర్తీ చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను సదరు వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువ పత్రాలతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుకు వాక్ ఇన్..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో ఒక కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్ పోస్టు భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. విద్యార్హత, వేతనం, దరఖాస్తు ఫారాల కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా మూర్తి



బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిగా ఏవీఎస్ఎస్ మూర్తి నియమితులయ్యారు. ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ బాపట్లకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న కె.లక్ష్మీశివజ్యోతి నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.5,000, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

బోగస్ ఓట్ల ఏరివేత

ఓట్ల దొంగలు దొరికిపోతున్నారు.. ఇప్పటి వరకు టీడీపీ ఓట్ల ఆటాడుకుంది. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి ఓట్లు సొంత ఓట్లుగా మలుచుకుంది. చనిపోయిన వారి ఓట్లనూ వదలలేదు. బూత్ స్థాయిలో ఎప్పటికప్పుడు రాద్ధాంతం చేస్తూ తొలగించకుండా అడ్డుకుంది. గతంలో అధికారం అండతో బరితెగించింది. ఓటరు సమగ్ర సర్వేతో బండారం బయటపడుతోంది. టీడీపీ నేతలకు వణుకుపుడుతోంది.

- విచారణ వేగవంతం
- తొలగింపులపై కలెక్టర్ ఆరా
- ఫిర్యాదులపై జేసీ ఆధ్వర్యంలో పరిశీలన
- ఐదు నియోజకవర్గాల్లో ఇప్పటికే విచారణ చేసిన కలెక్టర్
- జిల్లాలో అధికంగా మృత ఓటర్లు
- అంతే స్థాయిలో టీడీపీ బోగస్ ఓట్లు



చెరుకుపల్లి మండలం, గుళ్లపల్లిలో ఓటరు వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో దొంగ ఓట్ల తొలగింపునకు ఎన్నికల కమిషన్ చర్యలు వేగవంతం చేసింది. ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేస్తోంది. గత ఎన్నికల్లో టీడీపీ జిల్లాలోని అద్దంకి, పర్చూరు, రేపల్లె నియోజకవర్గాల్లో లబ్ధిపొందినట్లు తెలుస్తోంది. ఒక్కరికే రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండటం, మృతుల ఓట్లను తొలగించకుండా ఉంచుకోవడం, ఒకే ఇంటి నంబర్లతో పలు బోగస్ ఓట్లు ఉండటం లాంటి కారణాలతో టీడీపీ లబ్ధిపొందినట్లు సర్వేని బట్టి అర్థమవుతోంది.

దొంగ ఓట్లపై ఫిర్యాదులు ఇలా..

ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు సర్వేలో భాగంగా అక్రమ ఓట్లను తొలగించాలంటూ పలువురు స్వయంగా ఫారం-7 దరఖాస్తులు అందజేశారు. ఇప్పటి వరకు పర్చూరు నుంచి అధికంగా 13,356 దరఖాస్తులు వచ్చాయి. పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని తక్షణమే తొలగించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణ మోహన్, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వేమూరు, రేపల్లె, బాపట్ల, అద్దంకి, చీరాల నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యే కోన రఘుపతి, బాచిన కృష్ణచైతన్య, కరణం వెంకటేశ్, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 29,769 ఫారం-7 దరఖాస్తులు రాగా 2022 నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో 52 వేల ఓట్లను తొలగించారు. ఓట్ల తొలగింపులపైనా అధికారులకు ఫిర్యాదులు అందాయి.

ఫారం-7 దరఖాస్తులు	
పర్చూరు	13, 356
అద్దంకి	2,863
చీరాల	1,968
బాపట్ల	3,461
రేపల్లె	5,639
వేమూరు	2,482

తొలగింపులపై కలెక్టర్ విచారణ...

అక్రమంగా ఓట్లను తొలగించారంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులందడంతో తొలగించిన ఓట్లపై పునఃవిచారణ చేయాలని ఎన్నికల కమిషన్, కలెక్టర్‌ను ఆదేశించింది. విచారణ బాధ్యతలను కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు అప్పగించారు. నియోజకవర్గానికి వంద ఓట్లు చొప్పున కలెక్టర్ క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఇప్పటికే ఆయన రేపల్లె, వేమూరు, పర్చూరు, చీరాల, బాపట్లతో పాటు పలు ప్రాంతాల్లో విచారణలో పాల్గొన్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఒకటిరెండురోజుల్లో విచారణ చేయనున్నారు.

విచారణ వేగవంతం...

తొలుత నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. నిబంధనల మేరకు ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే విచారణ చేయాలని క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించారు. బోగస్ ఓట్లు, డబుల్‌ఎంట్రీలు, డెత్ ఓట్లను గుర్తించి తొలుత నోటీసులు జారీ చేశారు. ఐదేళ్లుగా మృతుల ఓట్లను జాబితాల నుంచి తొలగించకపోవడంతో ఆ తరహా ఓట్లు అధికంగా ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు. దీంతో పాటు డబుల్ ఎంట్రీలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

> **ఓటర్ల జాబితాలో అక్రమాలపై విచారణ**
>
> ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఓట్లకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తున్నాం. ఐదేళ్లుగా జాబితా నుంచి మృతుల ఓటర్లను తొలగించలేదు. దీనిపై విచారణ చేస్తున్నాం. అక్రమ ఓట్లపై ఆరోపణలు వచ్చాయి. ఓట్ల తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులు వచ్చాయి. వాటిపై విచారణ జరుపుతున్నాం. కొన్ని తప్పుడు ఫిర్యాదులు వచ్చాయి. అటువంటి ఫిర్యాదులు చేసిన వారిపైనా చర్యలు ఉంటాయి.
>
> – పి.రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

గురుదేవోభవ



విశాఖలో మంత్రి బొత్స చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పేరిరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ప్రతిభకు పట్టం కట్టింది. విద్యా బోధనలో విశేష ప్రతిభ ప్రదర్శించిన ఉపాధ్యాయులను సగౌరవంగా సన్మానించింది. విశాఖపట్నంలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయుల పండుగలో జిల్లాకు చెందిన పలువురు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు మంత్రి బొత్స సత్యనారాయణ అవార్డులు ప్రదానం చేశారు. మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడవర్తి పేరిరెడ్డి అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న పేరిరెడ్డిని పలువురు ప్రముఖులతో పాటు గ్రామస్తులు అభినందించారు. విద్యార్థులను స్కూల్ బాట పట్టించడంలో ఆయన ప్రతిభ ఎనలేనిదని పలువురు కొనియాడారు.

బాపట్ల అర్బన్: విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవంలో బాపట్ల మండలం వక్షనగర్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాతం సౌజన్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు.

బల్లికురవ: మండలం పెద్దమండిపూడి పాఠశాలకు చెందిన డి.స్వర్ణలత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదగా అవార్డు స్వీకరించారు. అవార్డు తీసుకున్న స్వర్ణలతను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

> **పాఠశాలే దేవాలయం**
>
> పాఠశాలే నాకు దేవాలయం. నా వృత్తే నాకు దైవం. నా పాఠశాలలో పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టా. కదిలే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశా. 2001లో 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తక రచయితగా వ్యవహరించా. 2008లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందాను. సీఎం విద్యారంగంలో అమలు చేస్తున్న సంస్కరణలతో విద్యార్థుల భవిష్యత్ మారిపోతోంది.
>
> – పి.పేరిరెడ్డి, హెచ్ఎం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇడుపులపాడు, బాపట్ల జిల్లా




విశాఖపట్నంలో మంత్రి బొత్స నుంచి అవార్డు అందుకుంటున్న స్వర్ణలత, సౌజన్య

విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- 19 మంది టీచర్లకు అవార్డుల ప్రదానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, జాయింట్ కలెక్టర్ శ్రీధర్, విద్యాశాఖ అధికారి రామారావు

బాపట్ల అర్బన్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఉపాధ్యాయులు అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపునిచ్చారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో పెదనందిపాడు రోడ్డులోని ఎం.ఎస్.ఆర్ కల్యాణ మండపంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం చేశారు. ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ ఉపాధ్యాయుల చేతిలోనే సమాజ భవిష్యత్ ఉందని చెప్పారు. సీఎం ఉన్నత ఆశయాలను అమలు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. విద్యా రంగానికి పెద్ద పీట వేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వరమని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన విద్యా రంగానికి జీవం వైఎస్ జగన్ పోశారని, కార్పొరేట్ స్కూళ్లకి దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌దేనన్నారు. విద్యార్థులను సరైన రీతిలో తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే నన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైనదని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు చేస్తోందని, ఉపాధ్యాయులు సానుకూల దృక్పథంతో శ్రమించి సత్ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం జిల్లాలో ఎంపిక చేసిన 14 మంది ఉపాధ్యాయులు, అలాగే సెంటా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రాత పరీక్షలో జిల్లా స్థాయి విజేతలు ఐదుగురిని ప్రశంసా పత్రం, మెమెంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారులు ఆర్.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సాదిక్ మహమ్మద్ పాల్గొన్నారు.

బాపట్ల ఇంజినీరింగ్‌లో..

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ నజీర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కృషి, దీక్ష, పట్టుదలతో శ్రమించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్ బాబు మాట్లాడుతూ శిశువును లోకానికి పరిచయం చేసిన అమ్మ మొదటి గురువైతే, గుండెలపై తన్నుతూ ఆటలాడే శిశువుకు నడక నేర్పే నాన్న రెండో గురువు, ఆ తర్వాత ఈ లోకంలో ఎలా నడుచుకోవాలో నేర్పి, విద్యా బుద్ధులు అందించే ఉపాధ్యాయుడు మూడో గురువు అని చెప్పారు. అందుకే పెద్దలు మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్య దేవోభవగా పేర్కొన్నారు. ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి, గురువు జాతి గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన మన దేశ రెండో రాష్ట్రపతి, మేధావి డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు.

కృత్రిమ మేధతో పరిశోధనలు

బాపట్ల అర్బన్: వ్యవసాయ రంగంలోనూ కృత్రిమ మేధతో పరిశోధనల అవసరం ఉందని ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల బాపట్ల, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా వ్యవసాయంలో కత్రిమ మేధ, యంత్ర అభ్యాసన శీర్షికన రెండు రోజుల వెబ్‌నార్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో ఈనెల 4, 5 తేదీలలో నిర్వహించారు. కార్యక్రమంలో కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసన, లాభాలను వాటి ప్రాముఖ్యత, ఆవశ్యకతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జాన్ వెస్లీ, డాక్టర్ ఎం.మాధవ, డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ బి.హరిబాబు, డాక్టర్ ఆర్.గణేష్ బాబు, డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్, డాక్టర్ కే కృపావతి పాల్గొన్నారు.

నక్సలైట్ల పేరుతో ఓ వైద్యుడికి బెదిరింపులు

- డబ్బుల కోసం డిమాండ్
- చివరికి మద్యం సీసాలతో పట్టుబడిన నిందితులు
- డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

చెరుకుపల్లి(రేపల్లె): నక్సలైట్ల పేరుతో ఓ ప్రముఖ వైద్యుడిని బెదిరించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. చెరుకుపల్లి పోలీసు స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. నీలకంఠం వెంకటరమణ(చెరుకుపల్లి), పిట్టు శివారెడ్డి (ఎం వీరాజుపాలెం), షేక్ సుల్తాన్‌బాషా(నడింపల్లి), పంది రాంబాబు(గుళ్లపల్లి), పోతార్లంక దుర్గారావు(బాపట్ల మండలం కొండుగొట్లవారిపాలెం) కలసి చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని గణేష్ హాస్పిటల్స్ వైద్యుడు గణేష్ వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. కారులో పాడేరుకు వెళ్లి అక్కడ నుంచి కొత్త సిమ్‌ల ద్వారా వైద్యుడు గణేష్‌తో నక్సలైట్లమని బెదిరిస్తూ రూ.20లక్షల ఇవ్వాలని వాట్సాప్ ద్వారా మెసెజీలు పెట్టడంతో పాటు ఫోన్ చేసి డిమాండ్ చేశారు. ఆ తరువాత అనంతపురం జిల్లాకు వెళ్లి అక్కడి నుంచి వేరే సిమ్‌ల ద్వారా గణేష్‌ను మరోమారు అన్నలమని, డబ్బులు ఇవ్వకుంటే ప్రాణాలు తీసి చంపేస్తామంటూ బెదిరింపులకు గురిచేశారు. గణేష్, బెదిరింపులకు తలొగ్గలేదు. దీంతో ఐదుగురు దుండగులు నిరాశ చెందారు.

మద్యం బాటిళ్లతో వస్తూ..

టార్గెట్ తప్పడంతో వాహనంలో తిరిగి ఇంటికి వస్తూ మిర్యాలగూడలో మద్యం బాటిల్స్‌ను తక్కువ ధరకు అమ్ముతున్నారని తెలుసుకుని తమ గ్రామంలో అధిక ధరలకు విక్రయించవచ్చని ఆశ పడి 180 ఎంఎల్ డైమెండ్ ఫైన్ విస్కీ 70 సీసాలను కొనుగోలు చేసి వాహనంలో తీసుకొచ్చినట్లు డీఎస్పీ వివరించారు. వీరి వాహనం చెరుకుపల్లి మండలం కుంచాలవారిపాలెం చెక్‌పోస్ట్ వద్దకు చేరుకుందన్న సమాచారంతో ఎస్ఐ సురేష్ అక్కడికి చేరుకుని వీరిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వాహనంతో పాటు మద్యం సీసాలను సీజ్ చేయటం జరిగిందన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నామని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ వై.సురేష్ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడి.. దుకాణం దహనం చేసి..

- రెచ్చిపోయిన దొంగలు
- పెంపుడు కుక్క మాయం
- చిలుమూరులో ఘటన


చిలుమూరులో దొంగలు దహనం చేసిన దుకాణాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొల్లూరు: దుకాణంలో చోరీకి పాల్పడిన దొంగలు.. వస్తువులను దహనం చేసిన ఘటన సోమవారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం .. మండలంలోని చిలుమూరుకు చెందిన యండూరి బద్రినాథ్, పచారీ సామన్లు, ఫ్యాన్సీ దుకాణం కలపి నిర్వహిస్తున్నాడు. కుటుంబంతో కలసి విజయవాడలోని సోదరుడి ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున ఓ మహిళ దుకా ణం నుంచి పొగలు వస్తుండటం గమనించింది. ఇంటివారిని అప్రమత్తం చేసేందుకు కేకలు వేచింది. ఇంట్లో నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఇంటి చుట్టుపక్కల వారిని లేపి విషయం తెలపడంతో స్థానికులు వచ్చి గమనించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించడంతో పాటు, దొంగతనం చోటుచేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే విజయవాడ వెళ్లిన బాధిత కుటుంబానికి సమా చారం ఇవ్వడంతోపాటు, కొల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపు తాళం తొలగించి వచ్చిన దుండగులు ఇంట్లో నగదు, ఆభరణాల కోసం ఇంట్లో లభించిన బీరువా తాళాలు పోలిఉన్న తాళాలతో బీరువాను తెరిచేందుకు చేసిన ప్రయ త్నం విఫలమైనట్లు తెలుస్తోంది. పక్కనే ఉన్న దు స్తులు పెట్టుకునే అల్మారలో ఉన్న పర్సులో, దుకాణంలోని గల్లా పెట్టెలో ఉన్న సుమారు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు నగదు తీసుకెళ్లారు. దుకాణంలో ఉన్న సామగ్రికి నిప్పు పెట్టి ఉడాయించారు. సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెంపుడు కుక్కను మాయం చేసి...

అదే గ్రామానికి చెందిన ధూళిపూడి రాధాకృష్ణమూర్తి నిద్రించే ముందు కుక్కను ఇంటి ఆవరణలో వదిలి ఇంటిలోపల నిద్రించారు. దొంగలు పెంపుడు కుక్కను మాయం చేశారు. ఇంటి తలుపు బయట గడియ పెట్టడంతోపాటు, మరో తలుపునకు బయటవైపు గడియ లేకపోవడంతో తలుపు తీసినా రాకుండా తలుపు హ్యాండిల్స్‌లో కర్ర పుల్లను అడ్డుగా ఉంచారు. అనంతరం కోళ్ల గూటిలో ఉన్న మూడు కోళ్లను తీసుకుని వెళ్లారు. ఘటనా ప్రాంతాలను మంగళవారం వేమూరు సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బాధిత కుటుంబాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

ప్రాధాన్య రంగాలకు రుణాలిచ్చి ప్రోత్సహించాలి

గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రాధాన్య రంగాలను ప్రోత్స హించే విధంగా బ్యాంకర్లు రుణాలిస్తే ఉపాధి మార్గాలు పెరగడంతో పాటు ఆర్థిక వృద్ధి పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు, పారిశ్రామిక వేత్తలు, చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో అత్యధిక శాతం పంటలు సాగు చేస్తున్నది కౌలు రైతులేనన్నారు. వారికి రుణాలిచ్చే క్రమంలో తగిన ప్రాధాన్యత నివ్వాలన్నారు. వ్యవసాయ శాఖాధికారులు ఎప్పటికప్పుడు దీనిపై రివ్యూ నిర్వహించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆశించిన స్థాయిలో గృహ, విద్యా రుణాలివ్వలేదన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి రుణాల మొత్తాలను, సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. చిరు వ్యాపారుల పెట్టు బడి కోసం అందిస్తున్న జగనన్న తోడు రుణాలను పెండింగ్ లేకుండా విడుదల చేయాలని చెప్పారు. అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెం టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ రుణాలు 15 రోజుల్లో అందించాలని ఆదేశించారు. గ్రామీణ యువత ఉపాధి కోసం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణలో డిమాండ్ ఉన్న మార్గాలను అన్వేషించాలని కోరారు. ప్రస్తుతం మార్కెట్ స్థితిగతులు మారిపోతున్నాయని, స్కిల్డ్ లేబర్ కోసం కంపెనీలు చూస్తున్నాయని చెప్పారు. బ్యాంకర్లు, ప్రభుత్వం కలిసి పనిచేస్తేనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. బ్యాంకర్లకు ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే తనను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మహీపాల్ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం విజయరత్నం, యూనియన్ బ్యాంక్ ఏజీఎం అశ్వత్ నాయక్, ఆర్బీ ఏజీఎం ఆర్‌కే హనుమ కుమారి, నాబార్డ్ డీడీఎం జి.శరత్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

నగరంపాలెం: సమాజంలో మంచి ఉపాధ్యాయులకు చాలా గౌరవం ఉంటుందని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవర ప్రసాద్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ గుంటూరు జిల్లా, ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించి, మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యాబోధన, ఆలోచనలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతాయని పేర్కొన్నారు. తద్వారా మంచి భావాలు, ఆలోచనలు, విద్యాబుద్ధులను కలిగి ఉంటారని పేర్కొన్నారు. తద్వారా నిత్య జీవితంలో వారికి మంచి గౌరవం లభిస్తుందని అన్నారు. గురు, శిష్యుల సంబంధాలు సమాజ ప్రగతిని సృష్టిస్తాయని చెప్పారు. విద్య, ఉపాధ్యాయులు, గురువుల పాత్ర చాలా ప్రభావితమైనవని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ గురువుల బోధనల వల్లే మంచి పౌరులుగా మారతారని అన్నారు. మంచి విద్యా బోధన, నడవడికతో సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వైఎస్ఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు థామస్‌రెడ్డి, గుంటూరు తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, నాయకులు ముత్యం, కార్పొరేటర్ స్మిత పద్మజ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐదు రోజుల్లో 30 శాతం రేషన్ పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో ఆహార భద్రత కింద పేదలకు ప్రతి నెలా అందజేసే ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. ఈనెల ఒకటి నుంచి ఐదవ తేదీ మంగళవారం సాయంత్రానికి 30 శాతం మంది లబ్ధిదార్లకు రేషన్ బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమ పండి పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1289 రేషన్‌షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాల సహాయంతో ఇంటింటికీ నిర్వహిస్తున్న నిత్యావసర సరుకులు 6,32,806 కార్డులకు పంపిణీ చేయాల్సివుండగా 1,94,248మందికి పంపిణీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. వీరిలో పంచదార 1,59,986మందికి, కందిపప్పు 3,958 మందికి ఇవ్వగా పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదార్లకు పంపిణీ చేస్తున్న ఫోర్టిఫైడ్ ఆటా 35,051మందికి అందజేశారు. ఈనెల 17వ తేదీ నాటికి జిల్లాలోని లబ్ధిదార్లందరికీ ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తామని డీఎస్ఓ వెల్లడించారు.

ఆటో దొంగను పట్టించిన సీసీ ఫుటేజ్

గంటల వ్యవధిలో కేసును ఛేదించిన పోలీసులు


స్వాధీనం చేసుకున్న చోరీకి గురైన ఆటో

నరసరావుపేట టౌన్: ఆటో చోరీ కేసును గంటల వ్యవధిలో వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. సంఘటన జరిగిన ప్రాంతంలో లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని కటకటాల వెనక్కి పంపించారు. వివరాల్లో కెళితే.. వినుకొండ పట్టణానికి చెందిన మహబూబ్ బాషా సోమవారం రాత్రి ఓవర్ బ్రిడ్జి ఎంట్రన్స్‌లో తన ఏపీ 07 టీసీ 1591 నెంబరు గల ఆటోను నిలిపి టిఫిన్ చేసేందుకు సమీపంలోని హోటల్‌కు వెళ్లాడు. టిఫిన్ చేసి వచ్చేసరికి ఆటో అపహరణకు గురైంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఆటో నడుపుతున్న వ్యక్తి ఎస్ఆర్‌కేటీ కాలనీకి చెందిన పాత నేరస్తుడు ఆర్య పోలికలు కలిగి ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. మొదట నేరం తాను చేయలేదని బుకాయించగా పోలీసులు తమదైన శైలిలో విచారించగా చోరీ వ్యవహారం బయట పడింది. అతను ఇచ్చిన సమాచారంతో బసికాపురం గ్రామం వద్ద చోరీకి గురైన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆటో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

చంద్రబాబు అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలి

- అమరావతి నిర్మాణం పేరుతో రూ.వేల కోట్లు దోపిడీ
- ఐటీ నోటీసులపై చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు మౌనం వీడాలి
- 2024 ఎన్నికలతో చంద్రబాబుకు గుణపాఠం
- మీడియాతో ఎమ్మెల్సీ పోతుల సునీత

ఒంగోలు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం భవన్‌లో మంగళవారం ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఆమె సమావేశం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణం పేరుతో రూ.వేల కోట్లను చంద్రబాబు దోచుకున్నారని ఆరోపించారు. ఆదాయపు పన్నుశాఖ రూ.118 కోట్లకు నోటీసులు జారీ చేసిందని, నిత్యం నానా రచ్చ చేస్తూ హంగామా సృష్టించే చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడితో పాటు పచ్చ మీడియా ఎందుకు మౌనం వహిస్తున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, పోలవరాన్ని ఏటీఎంలా మార్చుకున్నారని, ఈ క్రమంలోనే ప్రజలు విసిగి 2019 ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ఎన్ని కేసులు నమోదైనా మానేజ్ చేసే అలవాటు బాబుకు ఉందని చెప్పారు. తెలంగాణలో ఓటుకు నోటు కేసులో దొరికిపోయి పదేళ్లపాటు రాజధానిగా హైదరాబాదులో ఉండే అవకాశం ఉన్నా కేవలం సొంత ఆదాయం కోసం అమరావతిని రాజధానిగా ప్రకటించుకుని దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది నిజం కాకపోతే వార్త ప్రచురించిన మీడియాపై పరువు నష్టం దావా వేయాలని సవాల్ విసిరారు. భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీ, టీడీపీ ష్యూరిటీ అంటూ మరోమారు మోసం చేసేందుకు టీడీపీ నాయకులు యత్నిస్తున్నారని, ప్రజలు తిప్పికొట్టాలన్నారు.

చిత్రకారుడు బొండాకు సర్దార్ పటేల్ ఎక్సలెన్స్ అవార్డు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక అంశాలపై చిత్రాలను గీసే విజయవాడ భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్టాత్మక సర్దార్ పటేల్ ఎక్సలెన్స్ అవార్డ్–2023 లభించింది. మధ్యప్రదేశ్ భోపాల్‌కు చెందిన టీజీహెచ్ఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రకళ పోటీల్లో ఆయనకు ఈ అవార్డ్ దక్కింది. మంగళవారం కొరియర్ ద్వారా అవార్డ్‌ను అందుకున్న బొండా జగన్‌మోహన్‌రావును పలువురు చిత్రకారులు, ప్రముఖులు అభినందించారు. గిరిజనుల జీవన శైలిని నాగరిక సమాజానికి పరిచయం చేస్తూ వారి జీవితాలపై వందలాది చిత్రాలను చిత్రించిన ఆయన అనేక సమకాలీన, సామాజిక అంశాలపైకూడా అనేక చిత్రాలను అక్రలిక్ ఆయిల్ పెయింట్స్‌తో చిత్రించారు. ఈ సందర్భంగా డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ గిరిజనులకుకూడా విద్య, వైద్యం, సమాజంలో తగిన గౌరవం దక్కాలనే ఆశయంతో తాను ట్రైబల్ లైఫ్‌కు సంబంధించిన చిత్రాలను గీస్తున్నానని తెలిపారు.

గురుశిష్యులు ఇద్దరూ గెజిటెడ్ ఆఫీసర్లే..!

- గురువు సబ్ ట్రెజరీ అధికారి కాగా.. శిష్యుడు వినుకొండ తహసీల్దార్
- గురు పూజోత్సవం సందర్భంగా సత్కరించి, ఆశీస్సులు అందుకున్న వైనం


సబ్ ట్రెజరీ అధికారి అజ్మల్లాను సత్కరిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

వినుకొండ(నూజెండ్ల): గురుపూజోత్సవం సందర్భంగా వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో అరుదైన సంఘటన చోటు చేసుకుంది. వినుకొండలో పక్కపక్క కార్యాలయాల్లో పనిచేస్తున్న గురుశిష్యులు ఇద్దరూ గెజిటెడ్ హోదాలో ఉన్నారు. ఒకరు సబ్ ట్రెజరీ అధికారి అజ్మల్లా, మరొకరు వినుకొండ తహసీల్దార్ కిరణ్‌కుమార్. అయితే సబ్ ట్రెజరీ అధికారి గతంలో నరసరావుపేటలో టీచర్‌గా పని చేస్తున్న సమయంలో ప్రస్తుతం తహసీల్దార్‌గా ఉన్న కిరణ్‌కుమార్ ఆయన వద్ద విద్యను అభ్యసించారు. గురుభక్తితో అజ్మల్లాను తహసీల్దార్ కార్యాలయానికి ఆహ్వానించి దుశ్శాలువా, పూలమాలలతో గౌరవించి ఆశీస్సులు అందుకున్నారు. చదువు చెప్పిన గురువును సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇద్దరూ పక్కపక్క కార్యాలయాల్లో పనిచేస్తూ ఉన్నప్పటికీ వారిరువురు గురుశిష్యులని పెద్దగా ఎవరికీ తెలియదు. అయితే గురుపూజోత్సవం రోజున గురువును సత్కరించడంతో విషయం అందరికి తెలిసింది. ఈ సందర్భంగా పలువురు సహచర ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

సమగ్ర భూ సర్వేతో వివాదాలు పరిష్కారం

పల్నాడు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్


ఆర్డీఓ, తహసీల్దార్‌లకు సూచనలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

అచ్చంపేట: సమగ్ర భూ సర్వే ద్వారా దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూవివాదాలు పరిష్కారమవుతాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. థర్డ్ ఫేస్ కింద మండలంలోని గింజుపల్లి, ఓర్వకల్లు, మిట్టపాలెం గ్రామాలలో ఈ నెల 8నుంచి సమగ్ర భూసర్వే చేపట్టినట్లు తెలిపారు. డిసెంబరు చివరి నాటికి మూడు గ్రామాలలో 6 వేల ఎకరాల భూమిని రీ సర్వే చేయవలసి ఉంటుందన్నారు. సర్వే పూర్తయిన తరువాత భూ యజమానుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. సిబ్బంది వెంటనే కార్యాచరణ చేపట్టి ఆయా గ్రామాలలోఎవ్వరూ వేలెత్తి చూపకుండా భూ వివాదాలకు తావులేకుండా సంపూర్ణ సర్వే చేపట్టాలన్నారు. సమగ్ర భూ సర్వే విధివిధానాలను సర్వేయర్లు, వీఆర్వోలకు వివరించారు.

రైతులంతా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి...

రైతులంతా వేసిన పంటను ఈ–క్రాప్ చేయించుకోవాలని, అలా చేయించుకుంటేనే విపత్కర పరిస్థితులలో ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. వ్యవసాయ సిబ్బంది రైతులు వేసిన పంటలను నమోదు చేయా లని సూచించారు. మండలంలో కొన్ని గ్రామాలలో ఎత్తిపోతల పథకాలు ఆగిపోయాయని, వాటిని పునరుద్ధరించాలని కోరగా ఎత్తిపోతల పథకాల నిర్వహణలో రైతులు కూడా భాగస్వాములు కావాలన్నారు. అలా అయినప్పుడే ఎలాంటి అవాంతరాలు కలుగకుండా ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, అచ్చంపేట తహసీల్దార్ పద్మాదేవి, సర్వేయర్ శ్రీకాంత్, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

రూ.1.44 కోట్లతో మంచినీటి పథకం

ప్రారంభించిన తెనాలి ఎమ్మెల్యే శివకుమార్


మంచినీటి పథకం ప్రాజెక్టును ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిటౌన్: గ్రామంలోని ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరు ఎస్సీ కాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.1.44కోట్లతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం ప్రాజెక్ట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి శాశ్వతంగా శుభ్రమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. అనంతరం సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. సైడు కాల్వలు ఏర్పాటు చేయాలని, రోడ్లకు కల్వర్టులు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ప్రజలు కోరారు. రెండు నెలల్లో అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వారికి తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఎస్ఈ జి.బ్రహ్మయ్య, డీఈ గుప్తా, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, వైస్ ఎంపీపీ కోడూరి స్వప్న, ఎంపీటీసీలు నాగదేవిక, ఫణికుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


మాట్లాడుతున్న ఎన్జీ రంగా వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి

ఏఎన్‌యూ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి, సంపూర్ణ పౌరులుగా రూపొందించి సమాజానికి అందించాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అధ్యాపకులకు సూచించారు. యూనివర్సిటీ అధ్యాపక సంఘం(నూటా) ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉంటేనే పరిపూర్ణత చేకూరుతుందన్నారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అధ్యాపకులు కొత్త అంశాలను అధ్యయనం చేసి విద్యార్థులకు అందించాలన్నారు. విద్య, పరిశోధన, అధ్యయనం వంటి అంశాలలో అధ్యాపకులు ఎప్పుడూ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. సమాజాభివృద్ధికి దోహదం చేసే పరిశోధనలను అధ్యాపకులు ప్రోత్సహించాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నత ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రెక్టార్ ఆచార్య వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, నూటా అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య కె.గంగాధర్, ఆచార్య ఇ.శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. నూటా నాయకులు, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్

ఎన్జీరంగా వర్సిటీలో ...

గుంటూరు రూరల్: అధ్యాపకులు అంకితభావంతో పనిచేస్తూ విశ్వవిద్యాలయ అభ్యున్నతికి తోడ్పడాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం లాంఫాం నందున్న వర్సిటీ పరిపాలన భవనంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ క్రమశిక్షణతో కూడిన అత్యున్నత విలువలు కలిగిన ఆదర్శప్రాయుడని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ పి.సుధాకర్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, కంప్ట్రోలర్ డాక్టర్ ఏవీ రమణ, ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ పి.రవి, తదితరులు పాల్గొన్నారు.

జూపూడిలో కేరళ బృందం పర్యటన



ఇబ్రహీంపట్నం(మైలవరం): జూపూడి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కేరళ బృందం మంగళవారం సందర్శించింది. కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) నుంచి ఐఎస్‌ఓ జిల్లా కోఆర్డినేటర్లు కె.శ్రీరిషి, ఎంఎం రషీద్, ఈశ్వరన్ నంబూద్రి, రాష్ట్ర ఐటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ సి.బాలాజీ బృందం సందర్శించి.. పంచాయతీ విధానాలు, సదుపాయాలు, రికార్డుల నిర్వహణ, సభలు, సమావేశాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రికార్డుల మెయింటెనెన్స్, విద్య, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర వ్యవహారాలు సక్రమంగా జరిగితే ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఈ బృందం సిఫార్సు చేయనుంది. ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఈఓపీఆర్డీ మనోజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు పాల్గొన్నారు.